క్లుప్తంగా

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు.యాదవ సామాజిక వర్గానికి చెందిన పలువురు సంప్రదాయ వస్త్రాలు ధరించి,సేవ గరిడీ,సాముగరిడీ,కోలాట నృత్య ప్రదర్శన ద్వారా యాదవ వీధి నుంచి మరిడిమాంబ అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు.అక్కడ అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

మల్కాపురం: నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సోమవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టనున్నారు. ధర్నాకు పారిశ్రామిక ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలని కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతులు ఇస్తున్న భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం చైత్ర మాస శుద్ధ సప్తమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండ శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల ప్రత్యేక దర్శన కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షించారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

పీఎం పాలెం: పీఎం పాలెం రెండో బస్టాప్ సమీపంలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో నివసిస్తున్న దివ్యాంగుడు నియమాన సుభాష్ చంద్రబోస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పీఎం పాలెం సీఐ బాలకృష్ణ మీడియాకు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ తండ్రి 2023లో మృతి చెందగా, తల్లి, సోదరుడు కూడా గతంలో చనిపోయారు. దీంతో చంద్రబోస్ ఒంటరిగా జీవిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్‌కు శ్రీకాకుళానికి చెందిన ధనుంజయ రావు అనే స్నేహితుడు ఉన్నాడు. వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఆదివారం ఉదయం ధనుంజయరావు సుభాష్ చంద్రబోస్‌కు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో అపార్ట్‌మెంట్ ఓనర్‌కు సమాచారం అందించాడు. అపార్ట్‌మెంట్ ఓనర్ వాచ్‌మన్‌కు తెలియజేయగా, ఆదివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో కొంతమంది అపార్ట్‌మెంట్ వాసులు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, సుభాష్ చంద్రబోస్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మృతుడు గతంలో కూడా ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుని స్నేహితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం

దాబాగార్డెన్స్: జిల్లా బ్యాంక్ ఉద్యోగ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం దాబాగార్డెన్స్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు కోటేశ్వరరావు, సాత్యకి ప్రసాద్, శంకరరాజు, వసంతరావులు జెండాను ఎగురవేశారు. అనంతరం ఏఐబీఈఏ రూపకర్తలైన ప్రభాత్కర్, పర్వానా, తారకేశ్వర్ చక్రవర్తి , చెడ్డా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐబీఈఏ యూనియన్ ఏర్పడిన చారిత్రక నేపథ్యం, యూనియన్ గొప్పతనాన్ని వివరించారు.

లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం!



లక్షల వ్యయంతో నిర్మించిన హాకర్స్ జోన్

ప్రణాళిక లేకుండా చేసిన వ్యయం వృథా అవుతోంది. సాధ్యాసాధ్యాలను గమనంలోకి తీసుకోకుండా నిర్మించిన హాకర్స్ జోన్ అలంకార ప్రాయంగా మారింది. పుష్కర కాలంగా నిరుపయోగంగా ఉంది. అయినా సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో హాకర్స్ జోన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 35 షాపులు ఖాళీగా ఉన్నాయి.



ప్లాస్టిక్ పెట్టెలు పెట్టి ఆక్రమించిన వైనం

వృథాగా హాకర్స్ జోన్ | ఆక్రమణకు గురవుతున్న వైనం | స్పందించని యంత్రాంగం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక సుమారు 35 షాపులను 2014లో నిర్మించారు. దీని కోసం జీవీఎంసీ అధికారులు సుమారు రూ. 17 లక్షలు ఖర్చు చేశారు. మల్కాపురం నుంచి కోరమాండల్ వరకు సర్వీసురోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులను అందులోకి తరలించాలని యోచించారు. తద్వారా ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టాలని అనుకున్నారు. అయితే తరలింపు మాత్రం సాధ్యం కాలేదు. దీంతో అప్పటి నుంచి హాకర్స్ జోన్ అలంకార ప్రాయంగా ఉంది.



హాకర్స్ జోన్ దుకాణాల్లో విశ్రాంతి తీసుకుంటున్న భిక్షాటన చేసే వారు

ఆకతాయిలకు అడ్డాగా..

ఏళ్ల తరబడి హాకర్స్ జోన్ ఖాళీగా ఉండడంతో మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. కొంత మంది రాత్రి సమయంలో ఇక్కడ మద్యం,గంజాయి వంటివి సేవిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మరి కొంత మంది వ్యాపారులు జీవీఎంసీ అధికారుల వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా..అద్దె చెల్లించకుండా దర్జాగ షాపులను ఆక్రమించి చికెన్ సెంటర్, టిఫెన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు.అలాగే కొంత మంది భిక్షాటన చేసుకున్న వారు ఈ షాపులను నివాసాలుగా మార్చుకున్నారు. మొత్తం మీద ఏ లక్ష్యంతో ఇక్కడ షాపులు నిర్మించారోదానికి చెద పట్టిందని.. ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ షాపులు వేరే వారికి కేటాయించి ఆదాయ వనురుగా మార్చి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కదలని వ్యాపారులు

శ్రీహరిపురం,కోరమాండల్,మల్కాపురం ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిత్యం తలెత్తడంతో నాటి ట్రాఫిక్ అధికారులు ఫుట్‌పాత్,తోపుడుబళ్ల వ్యాపారుల కోసం హాకర్స్ జోన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు జీవీఎంసీ అధికారులు మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల స్థలంలో హాకర్స్ జోన్‌ను ఏర్పాటు చేశారు. అయితే అక్కడికి వచ్చేందుకు ఫుట్‌పాత్,తోపుడుబళ్ల వ్యాపారులు నిరాకరిస్తున్నారు.

ప్రణాళిక లోపమే కారణమా!

అధికారులు ముందు చూపు లేకుండా హాకర్స్ జోన్ నిర్మించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న హాకర్స్ జోన్‌ను రోడ్లపై వచ్చే వారు గుర్తించలేరని వ్యాపారులు చెబుతున్నారు. దీని వల్ల తమ వ్యాపారాలు సాగవని, ఆర్థిక ఇబ్బందులు పడతామని అందులోకి రావడానికి నిరాకరించారు. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన షాపులు ఖాళీగా ఉన్నాయి.

కల్యాణం.. కమనీయం

ఘనంగా చంద్రమౌళీశ్వర స్వామి వార్షికోత్సవం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



సుబ్రహ్మణ్యస్వామి రాక కోసం ఎదురు చూస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సీతారామ రాజునగర్‌లో వేంచేసిన పార్వతీ చంద్రమౌళీశ్వరస్వామి 43వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరులకు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అనంతరం స్వామి ఉత్తవమూర్తులను ప్రత్యేక మండపంపై అధిష్ఠింపజేసి అర్చకులు తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి, స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ కల్యాణోత్సంలో పాల్గొన్నారు. వారిని ఆలయ కమిటీ తరఫున సత్కరించి కల్యాణ ప్రసాదం అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇచ్చారపు నాగేంద్ర, కార్యదర్శి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం అనంతరం పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి తిరువీధి సేవకు తీసుకెళ్లారు. దారిపొడవునా భక్తులు దర్శించుకొని మొక్కలు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు రవి శంకర్, కేఎస్ఎన్ రాజు, భరత్ కుమార్, హరిశంకర్ ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగస్వాములయ్యారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. మద్యం షాపుల వద్ద చిందులేసినా, గొడవలు చేసిన ఊరుకునేది లేదన్నారు. మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనలో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించండి

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా, మంచిగా జీవించాలని సూచించారు. హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



ఆరిలోవ లాడ్జీలో యువకుడి బ్యాగు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కృష్ణ



రుషికొండ లాడ్జీలో యువకుడి ఆధార్ కార్డు పరిశీలిస్తున్న ఎస్ఐ రాందాస్

ఆరిలోవ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసులు శనివారం అర్ధరాత్రి లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలన్నింటిలోనూ సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు కృష్ణ, రాందాస్, ఏఎస్ఐలు మూడు బృందాలుగా విడిపోయి తనఖీలు నిర్వహించారు. శ్రీకాంత్‌నగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లోని 17 లాడ్జీలకు పోలీసులు వెళ్లి.. అక్కడ ఎంతమంది ఉన్నారు.. ఏయే రూంలలో ఉన్నారు.. అనే వివరాలను రిసెప్షన్ వద్ద సేకరించారు. అనంతరం గదుల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. వారి ఆధార్ కార్డులు పరిశీలించి, ఎక్కడి నుంచి వచ్చారు, ఏ పనులపై వచ్చారు, ఎప్పటి నుంచి లాడ్జీలో ఉంటున్నారు తదితర వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ కార్డు, వారి పూర్తి వివరాలు, అడ్రస్ తెలుసుకున్న తర్వాతే రూమ్‌లు ఇవ్వాలని లాడ్జీల యజమానులకు పోలీసులు సూచించారు.

ఘనంగా ఈస్టర్ ప్రార్థనలు



శాంతిసందేశం ఇస్తున్న పాస్టర్ డేవిడ్ పాల్



సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న క్రైస్తవ కుటుంబ సభ్యులు



క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాలశౌరీరెడ్డి



క్రీస్తును స్తుతించే ప్రార్థనల్లో చిన్నారులు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరాస శాంతి వనం కార్యవర్గం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతి వనం కార్యవర్గ ప్రతినిధులు క్రైస్తవ సహోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యదర్శి వై. ఆంథోని, కోశాధికారి ఎలివాడ డేవిడ్‌పాల్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో శాంతి వనం అధ్యక్షుడు వై.రాజు, ఉపాధ్యక్షులు వై .ప్రభుదాస్,కె.జే.ఎల్ సుధాకర్, హెన్రీ డానియల్, డియోఫిలాస్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ సేవియర్ లూథరన్ చర్చి, ఏస్కోల్ ప్రార్థన మందిరం, బెతస్థ చర్చి, బాప్టిస్ట్ చర్చి, బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆంథోని, ఎరుషలేము ప్రార్థన మందిరంలో భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. యువతీ యువకులు ప్రత్యేక గీతాలు ఆలపించారు.

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా నిర్వహించే పాస్కా(ఈస్టర్) ఉత్సవాన్ని జ్ఞానాపురం రక్షణగిరిలో సెయింట్ పీటర్స్ పునీత పేతురి ప్రధాన దేవాలయం విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పారిస్ పాస్టల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్ అధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని, గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు అంటే శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటకు వస్తారని క్రైస్తవులు నమ్ముతారని విశాఖ అపోస్తలిక్ పాలనాధికారి, విశాఖ అతిమేత్రాశనం అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాలశౌరీరెడ్డి అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరిలో పునీత పేతూరు రాయప్ప దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. రక్షణగిరిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యపూజా బలులు సమర్పించారు. గురువులు ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ అంథోనిరాజ్ ప్రత్యేక ప్రార్థనల్లో పరిశుద్ధ జలమును అభిషేకించారు. క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచే ఘటనను చూపిస్తూ ప్రదర్శించిన భారీ సెట్టింగ్, చిన్నారులు ప్రదర్శించిన పలు కార్యాక్రమాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. పారిస్ పాస్టల్ కౌన్సిల్(పీపీసీ) సభ్యులు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలిండియా కేథలిక్ యూనియన్ జాతీయ కార్యదర్శి బీవీఆర్ శేషుబాబు, హేమాల విజయకుమార్, బేతా జోసెఫ్, శ్యామలరావు తదతరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో వివాహితకు ఆశ్రయం

సీతమ్మధార: అన్నవరానికి చెందిన వివాహిత లలిత ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. దిక్కుతోచని స్థితిలో రైల్వే స్టేషన్‌లో ఉండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులు గుర్తించారు. తక్షణమే స్పందించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు, ఆమెకు సహాయం అందించేందుకు ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఏయూటీడీ సిబ్బంది మహిళా షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయిని సంప్రదించగా, ఆమె తక్షణమే రైల్వే స్టేషన్‌కు చేరుకుని లలితను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. అనంతరం లలితకు సీతమ్మధారలోని టి.యస్.ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అక్కడ ఆమెకు భోజనం, వసతి కల్పించారు.

అన్నమాచార్య సంకీర్తనలతో శ్రీనివాసుని కటాక్షం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తనా పోటీలు నిర్వహించారు. కప్పరాడ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తితో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని కటాక్షం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు భక్తిని కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఐదు విభాగాల్లో జరిగిన పోటీలో నగరానికి చెందిన 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి వంకాయల సన్యాసిరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కె.ఎ.రాజు, అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కన్వీనర్ సి.హెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్, అరుణకాంత్ పాల్గొన్నారు.

ప్రయోజనకరంగా పరిశోధనలు



రక్షితకు డాక్టరేట్ అందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: పరిశోధనలు సమాజానికి మేలు చేసేలా యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు మరింత సాధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని టీకి జయరక్షితకు ఏయూ డాక్టరేట్ లభించింది. వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఏ హోలిస్టిక్ అనాలసిస్ ఆఫ్ బనానా ఫైబర్-రీన్ ఫోర్స్‌డ్ సస్టైనబుల్ కాంక్రీట్ ఆఫ్ ఎం 25, అండ్ ఎం 35' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయ రక్షితను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.